TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం | ఎడిటర్: కనుకుల అనంతరెడ్డి | జాతీయ తెలుగు దినపత్రిక

www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 208 | బుధవారం, ఆగస్టు 19, 2026 | పేజీలు : 04 | వెల రూ. 1.00/-



ARK MEDIA
SUBSCRIBE

## విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754


## లంచం తీసుకుంటూ జీహెచ్‌ఎంసీ అధికారి పట్టుబాటు

**రూ.20 వేలు లంచం డిమాండ్ చేసిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్**
**రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు**
**భవన నిర్మాణ అనుమతి కోసం లంచం డిమాండ్**
**ప్రభావతిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులు**
**లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయాలని సూచన**



**హైదరాబాద్, ఆగస్టు 18 (నేటి ప్రభాత దర్శిని):**

పాతబస్తీ చాంద్రాయణగుట్ట ఫూల్‌బాగ్‌లోని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (సంతోష్‌నగర్ సర్కిల్-25)గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్. ప్రభావతి భవన నిర్మాణ అనుమతి కోసం రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడి వద్ద నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ప్రభావతిని న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే 1064 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

## మెట్రో ఫేజ్-2 అనుమతులకు కసరత్తు

### ప్రక్రియను వేగం చేసే పనిలో అధికారులు

**హైదరాబాద్,ఆగస్ట్18(నేటి ప్రభాత దర్శిని):**

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సంబంధించిన అనుమతుల పక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన ఎన్‌సీఓలను త్వరగా జారీ చేయాలని పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు సచివాలయంలో కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులతో జయేష్ రంజన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్‌ఎమ్‌ఆర్‌ఎల్ ఎండీ, హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. కేంద్ర అనుమతుల కోసం డీపీఐఐటీ నెట్‌వర్క్ ఎ÷-లానింగ్ గ్రూప్ పక్రియలో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ఫేజ్?2లో భాగంగా 7 కారిడార్ల ద్వారా మొత్తం 122.9 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన భూసేకరణ, రైల్వే క్రాసింగ్‌లు, మూసీ నది దాటే ప్రాంతాలు, గ్యాస్ పైప్‌లైన్లు, విమానాశ్రయ పరిధిలో నిర్మాణ అనుమతులపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రతిపాదిత కారిడార్లకు అన్ని శాఖలు త్వరితగతిన ఎన్‌సీఓలు జారీ చేయాలని సర్ఫరాజ్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. ఫేజ్?2 పనులు ముందుకు సాగితే హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ మరింత విస్తరించి, నగరంలో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది.

## రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి లక్షల కోట్ల ఆస్తులు

### సర్కారు కుట్రలకు తెలంగాణ ప్రజలు బలి: బిఆర్ఎస్

**హైదరాబాద్,ఆగస్ట్18(నేటి ప్రభాత దర్శిని):**

హైదరాబాద్‌లో లక్షల కోట్ల విలువైన ప్రజల ఆస్తులకు రేవంత్‌రెడ్డి సర్కారు '22-ఎ' తో సంకెళ్లు వేసిందని బీఆర్‌ఎస్ పార్టీ ఆరోపించింది. సామాన్యుల ఆస్తులను, దశాబ్దాలుగా ఉంటున్న కాలనీలను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి నెట్టి, సామాన్యుడి కాళ్ల కింద నేలను లాక్ చేశారని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్రావు, వినోద్, సత్యవతి రాథోడ్ తదితరులు మాట్లాడారు.ఆస్తులు అమ్ముకోలేక, కనీసం బ్యాంకులో కుదువపెట్టి అప్పు తెచ్చుకోలేక ప్రజలు విలవిల్లాడుతున్నారని బీఆర్‌ఎస్ నేతలు విమర్శించారు. ప్రజల ఆస్తులను బందీ చేసిన ఈ తుగ్లక్ ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తాము అండగా నిలబడుతామని అన్నారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు వారి ఆస్తులను ఇప్పిస్తామని చెప్పారు.

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం





**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గొప్ప యోధుడు**
**హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ**
**2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం**
**బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు**
**ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం**
**విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 18 (నేటి ప్రభాత దర్శిని):**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# 20 నుంచి సిఎం రేవంత్ విదేశీ పర్యటన

**పది రోజుల పాటు యూకె, అమెరికా సందర్శన**

**హైదరాబాద్,ఆగస్ట్18(నేటి ప్రభాత దర్శిని):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆగస్టు 20 నుంచి 30వ తేదీ వరకు లండన్, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలను సందర్శించడంతో పాటు వివిధ సమావేశాల్లో పాల్గొననున్నారు. ఆగస్టు 20వ తేదీ అర్ధరాత్రి 12:30 గంటలకు న్యూఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరనున్నారు. ఆగస్టు 20 ఉదయం 7 గంటలకు యూకే స్థానిక కాలమానం ప్రకారం లండన్ చేరుకోనున్నారు. ఆగస్టు 21న ఉదయం 10:30 గంటలకు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ఫుట్‌బాల్ ప్రెజెంటేషన్ కార్యక్రమం కోసం ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు. 22న ఉదయం 10:30 గంటలకు కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. ఉదయం 11:30 గంటలకు లండన్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను సందర్శించ నున్నారు. సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించనున్నారు. యూకే పర్యటన అనంతరం ఆగస్టు 23న సీఎం రేవంత్ రెడ్డి లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరి వెళతారు. అక్కడ కూడా పలు ప్రముఖ విద్యా సంస్థలను సందర్శించి సమావేశాల్లో పాల్గొననున్నారు. 24న ఉదయం 10:30 గంటలకు హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంఐటి క్యాంపస్‌ను సందర్శిస్తారు. అదే రోజు రాత్రి 7 గంటలకు బాస్టన్ నుంచి న్యూయార్క్‌కు బయలుదేరనున్నారు. 25న ఉదయం 10:30 గంటలకు నోర్త్-ఈస్టర్న్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సీఎం సందర్శించనున్నారు. సాయంత్రం 4 గంటలకు వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందంతో సమావేశం కానున్నారు. 26న న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు, వివిధ వర్గాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యే అవకాశం ఉంది. అమెరికా పర్యటన ముగించుకుని ఆగస్టు 29న న్యూయార్క్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. 30న హైదరాబాద్ చేరుకోనున్నారు. మొత్తంగా సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో యూకే, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, బిజినెస్ స్కూళ్లను సందర్శించడంతో పాటు పలు ప్రతినిధి బృందాలతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటన ద్వారా విద్య, పరిశ్రమలు, పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు సంబంధించిన అంశాలపై చర్చలకు అవకాశం ఉండనుంది.



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

**నేటి ప్రబాత దర్శిని, ఆగస్టు 18 (ముస్తాబాద్ -ప్రతినిధి):**

ముస్తాబాద్ మండల బంధనకల్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌడ కుల సంఘం అధ్యక్షులు గుర్రం బాలగౌడ్ , విగ్రహ దాత గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం వెంకటేశ్వరి , బదనకల్ గ్రామ సర్పంచ్ ముస్తాబాద్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు చిగురు నరేష్ గ్రామపంచాయతీ పాలకవర్గం.గౌడ కుల సంఘం ఉపాధ్యక్షులు చింతల నాగరాజు, విచ్చేసినటువంటి మాజీ జెడ్పిటిసి మెరుగు యాదగిరి గౌడ్ , మెరుగు అంజా గౌడ్ , ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ , బీసీ స్టడీ డైరెక్టర్ సర్పంచ్ వెంకటస్వామి , వెంకటస్వామి గౌడ్ మాజీ ఎంపీపీ స్వప్న రవీందర్ గౌడ్ , గ్రామంలోని అన్ని కుల సంఘల అధ్యక్షులు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న చేసినటువంటి సేవలను కొనియాడారు.



## తెలంగాణ చత్రపతి శివాజీ సర్దార్ సర్వాయి పాపన్న

**నిజాం మొగల్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం**

**పార్టీలకతీతంగా పాపన్న గౌడ్ 376 జయంతి ఉత్సవాలు**

**పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కదారితిరుపతి**



**నేటి ప్రభాత దర్శిని పెగడపల్లి**

పెగడపల్లి మండల కేంద్రంలో మండల పరిధిలోని పలు గ్రామాల గౌడ కులస్తుల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కదారి తిరుపతి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పార్టీలకతీతంగా గౌడ కులస్తులు పలువురు నాయకులు పాల్గొన్నారు అనంతరం కదారి తిరుపతి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న తెలంగాణ జాతిఖ్యాతిని సభండవర్ణాలను ఏకం చేసి తెలంగాణ ఆత్మగౌరవాన్ని తరతరాలుగా ఖ్యాతిని నిలిచేలా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 15వ శతాబ్దానికి చెందిన తెలంగాణ విప్లవ వీరుడు గోల్కొండ నవాబుల అణిచివేతను సామాన్య ప్రజలపై జరుగుతున్న వివక్షతను అన్యాయాలను అరికట్టడానికి ప్రజలను ఏకతాటిపై తీసుకువచ్చి నిజాం మొగల్ పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా రైతులను చేతివృత్తుల వారిని సబండ వర్ణాలను చేసి ఏకం చేసి 12000 సైనికులతో తిరుగుబాటు జెండా ఎగరవేసి గోల్కొండను స్వాధీన పరుచుకొని ఏడు నెలల పాటు అధికారం చెలాయించిన గొప్ప వీరుడు అలాంటి యోధుడు చత్రపతి శివాజీ సమకాలికుడు సర్వాయి పాపన్న మన తెలంగాణ జాతి ఖ్యాతిని హైందవ వీరుడు హిందూ ధర్మ రక్షకుడు సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రను ఈ నేలపై మనం మరువకూడదు అలాగే రాబోయే జయంతి ఉత్సవాల వరకు పెగడపల్లి మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని మాట్లాడారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల గౌడ కులస్తులు పలువురు నాయకులు పెద్ద ఎత్తునపాల్గొన్నారు.

## ఎస్సీ సి వర్గీకరణ ఫలాలను విద్యార్థిని విద్యార్థులకు అవగాహన



**నేటి ప్రభాత దర్శిని, ఆగస్టు 18(ముస్తాబాద్ -ప్రతినిధి ):**

ముస్తాబాద్ మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్మెట రాజు ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి పుట్ట రవి మాదిగ మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు 33 జిల్లాలలో జిల్లా కమిటీలతోపాటు మండల కమిటీలు గ్రామ కమిటీలు నిర్వహించి, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీ నిర్వహించి ఈనెల చివరి వారంలో మండల కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని,దీనికి విద్యార్థులు మేధావులు మాదిగ రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని కమిటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకొని మధ్యలోనే ఆపేయడం జరుగుతుందిని,అలా కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నటువంటి శిక్షణ తీసుకొని పై చదువులకు వెళ్లాలని మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ చదువుకున్న మేధావులు, గ్రామీణ ప్రాంత ఎస్సీ మాదిగ ఉపకులాలకు వారి గ్రామాలలో పై చదువుల కొరకు అవగాహన కల్పించే విధంగా ప్రయత్నించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు చుంచు మల్లన్న, జిల్లా కన్వీనర్ ఎనగందుల బిక్షపతి, ఎం ఎస్ పి జిల్లా నాయకులు ఖానాపురం లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొల్లూరి నాగరాజు, నల్ల సంతోష్ ఎమ్మార్పీఎస్ సంబంధించిన నాయకులు పాల్గొన్నారు.

## మైనింగ్ క్వారీ ప్రమాదం కేసు

**అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్**

**మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్**

**అమరావతి,ఆగస్ట్18(నేటి ప్రభాత దర్శిని):**

ప్రకాశం జిల్లాలో మైనింగ్ క్వారీలో జరిగిన ప్రమాదం కేసులో అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో పలువురి ప్రమేయం ఉన్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. అలాగే ప్రైవేట్ మైనింగ్ సంస్థ ప్రతినిధి, కన్‌స్టలెంట్‌ను అరెస్ట్ చేశారు. వీరిని విజయవాడ కోర్టులో హాజరుపరచనున్నారు. గతంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు రూ. లక్ష లంచం ఇచ్చినట్లు కూడా సీబీఐ గుర్తించింది. అనుకూల నివేదికతో పాటు మైనింగ్ సంస్థ నుంచి త్రైమాసిక లంచాల కోసం రూ. 2 లక్షలు ఏర్పాటు చేసినట్లు కనుగోంది. మైనింగ్ క్వారీ ప్రమాదంలో అనుకూల నివేదిక కోసం రూ. 2 లక్షల నగదు తీసుకుంటూ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. సందర్భంగా ఆ నగదును సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒంగోలు, కడప, హైదరాబాద్‌లలో నిందితులకు చెందిన ఇళ్లలో కూడా సీబీఐ సోదాలు చేపట్టింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖలో 25 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సభ్యత్వ నమోదు





**నేటి ప్రభాత దర్శిని కామారెడ్డి ప్రతినిధి**

కామారెడ్డి: కామారెడ్డి జిల్లా జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన 25 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు జేఏసీ సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, జిల్లా జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, జిల్లా జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం జేఏసీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ జేఏసీతో కలిసి ముందుకు సాగాలని, తమ హక్కుల సాధన కోసం ఐక్యతతో ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సంఘటితం చేసి జేఏసీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఉద్యోగుల నుంచి మంచి స్పందన లభించిందని, రానున్న రోజుల్లో మరిన్ని శాఖల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఇక్రమ్, మునీర్, అనిత, జేఏసీ నాయకులు హరీష్, మహేష్, నాగేష్, అరుణ్, రాము, నరేష్, సౌందర్య, స్రవంతి తదితర జేఏసీ నాయకులు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం

**మెరుగైన ధర లభించేలా కృషి: అచ్చన్న**

**అమరావతి,ఆగస్ట్18(నేటి ప్రభాత దర్శిని):**

పొగాకు రైతులకు మెరుగైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లలో సానుకూల పురోగతి సాధించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 117 వేలాలు పూర్తి.. సుమారు 60 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం ఎఫ్‌సీవీ పొగాకు సగటు ధర కిలోకు సుమారు రూ.210గా ఉందని పేర్కొన్నారు. ఇటీవలి రోజుల్లో రోజుకు 1.5 నుంచి 2 మిలియన్ కిలోల వరకు పొగాకు అమ్మకాలు జరుగుతున్నాయని వివరించారు. కొనుగోళ్ల వేగం పెరగడం.. 'నో-బిడ్' శాతం క్రమంగా తగ్గడం మంచి పరిణామం అని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో మరోసారి చర్చించామని తెలిపారు. కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని కంపెనీలు, ట్రేడర్లకు ఇప్పటికే స్పష్టమైన సూచన చేశామని వివరించారు. నో-బిడ్స్'ను మరింత తగ్గించి రైతుల వద్దనున్న పొగాకు వేగంగా కొనుగోలు చేయాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు లభించే సగటు ధర మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని కూడా కోరినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి శుభాకాంక్షలు



**బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి**

**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా పాపన్న గౌడ్**

**తెలంగాణ చరిత్రలో తొలి బహుజన సామ్రాజ్య స్థాపకుడు**

**ఆయన ఆశయాల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి**

**బహుజన రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలి**

**సిరిసిల్ల (నేటి ప్రభాత దర్శిని):**

బహుజన చక్రవర్తి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ చరిత్రలో తొలి బహుజన సామ్రాజ్యాన్ని స్థాపించిన మహనీయుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి 376వ జయంతి ఉత్సవ శుభాకాంక్షలు. మొఘల్ పాలనకు వ్యతిరేకంగా ధిక్కార స్వరాన్ని వినిపించి, గోల్కొండ కోటను జయించిన ధీరుడు, శౌర్యానికి ప్రతీక మన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. గౌడ కత్తి పదును శత్రువులకు రుచి చూపించి, ఆనాడే స్వరాజ్య పాలనకు పునాది వేశారని తెలిపారు. "మనల్ని మనమే పరిపాలించుకోవాలి" అనే స్ఫూర్తిని సమాజానికి అందించిన గొప్ప మహానుభావుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఆయన మన గౌడ జాతిలో జన్మించడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ గౌడ కులస్తులందరం ఏకతాటిపై నిలిచి మన ఐక్యతను చాటాలని, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బహుజన రాజ్యాధికార సాధన కోసం ఐక్యంగా అడుగులు వేయాలని కోరారు. జై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్! జై బహుజన్! అని పేర్కొన్నారు. ఇట్లు, బొల్గం వైష్ణవి నాగరాజు గౌడ్, 10వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్, సిరిసిల్ల.

## ఫోటోగ్రఫీలో రాణిస్తున్న పాలోజి శంకర్ చక్రి

**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అద్భుత చిత్రాలు**

**28 ఏళ్లుగా ఫోటోగ్రఫీ రంగంలో కొనసాగుతున్న శంకర్ చక్రి**

**బ్లాక్ అండ్ వైట్ రీల్ నుంచి డిజిటల్ ఫొటోల వరకు ప్రస్థానం**

**మనసుకు హత్తుకునే ఛాయాచిత్రాలతో ప్రత్యేక గుర్తింపు**

**సాన్వి డిజిటల్ ఫోటో స్టూడియో నిర్వాహకుడిగా సేవలు**

**సిరిసిల్ల, ఆగస్టు 18 (ప్రభాత దర్శిని ప్రతినిధి):**



ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన పాలోజి శంకర్ చక్రి తీసిన అద్భుత చిత్రాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. గత 28 సంవత్సరాలుగా ఫోటోగ్రాఫర్‌గా వృత్తిని ఎంచుకున్న ఆయన చిన్నతనం నుంచే ఫోటోగ్రఫీ రంగం వైపు అడుగులు వేశారు. ఆయన అన్న కూడా ఫోటోగ్రాఫర్ కావడంతో అన్నతో కలిసి ఫోటోగ్రఫీ నేర్చుకుని అదే రంగంలో కొనసాగుతున్నారు. తన నైపుణ్యంతో ఎన్నో మనసుకు హత్తుకునే ఛాయాచిత్రాలను తీసి ఫోటోగ్రఫీ రంగంలో రాణిస్తున్నారు. బ్లాక్ అండ్ వైట్ రీల్ ఫొటోల నుంచి డిజిటల్ ఫొటోల వరకు అనేక అద్భుత చిత్రాలను తీశారు. పలు సర్టిఫికెట్లకు ఎంపికైన ఫొటోలను కూడా తీసిన ఘనత ఆయనకు ఉంది. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆయన తీసిన ఆకట్టుకునే ఛాయాచిత్రాలు పలువురి మన్ననలు పొందుతున్నాయి. సాన్వి డిజిటల్ ఫోటో స్టూడియో నిర్వాహకుడిగా పాలోజి శంకర్ చక్రి ఫోటోగ్రఫీ రంగంలో తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

నేటి ప్రభాతదర్శిని
TS 24 0026809
www.netiprabhatadarshini.in 94932 72754

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు

**మండల గౌడ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు నాగుల రాజశేఖర్ గౌడ్**

**నేటి ప్రభత దర్శిని పెగడపల్లి**



పెగడపల్లి మండల కేంద్రంలో మండల గౌడ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో క్షేత్రియుడే కత్తి పట్టాలన్న సూత్రాన్ని మార్చిన మహా యోధుడు,బహుజన విప్లవ వీరుడు,గోల్కొండ మహారాజ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించిన పెగడపల్లి మండల గౌడ సంఘం సభ్యులు.ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్,మండల గౌడ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు నాగుల రాజశేఖర్ గౌడ్,మండల పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి,లోక మల్లారెడ్డి, ముంజ మధు గౌడ్, చంద్రశేఖర్,గంగాధర్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్,బొమ్మిన స్వామి, ఆనందం,నరేందర్ రెడ్డి,సాయిని రవీందర్,ప్రభాకర్ గౌడ్, తిరుపతినాయక్,రహీం,శ్రీనివాస్ గౌడ్,కరుణాకర్ రెడ్డి, ఎలకటూరి రవి,రమేష్ నాయక్,అజయ్,బాలుసాని కిషన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,మొశీదయ్య గౌడ్,లచ్చ గౌడ్,మల్లేశం గౌడ్,ముని గౌడ్,శ్రీను గౌడ్,రాజు గౌడ్,భాస్కర్ గౌడ్,శంకర్ గౌడ్,రవి గౌడ్,బాబు, ఎల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

**ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు**

**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్**



**నేటి ప్రభాత దర్శిని జగిత్యాల ప్రతినిధి**

కొండగట్టు వద్ద కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, రహదారి పరిస్థితి, వాహనాల కదలిక, వాహన వేగం తదితర అంశాలపై సంబంధిత పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అన్ని కోణాల్లో విచారించి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, వాస్తవాలను వెలికితీసే విధంగా దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు.వాహనదారులు అధిక వేగంతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముందున్న వాహనాలను ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తగా నడుపుతూ, ముందున్న వాహనాలకు తగిన దూరం పాటించాలని, ప్రధాన రహదారులపై మరింత అప్రమత్తంగా ప్రయాణించాలని తెలిపారు.ఎస్పి అశోక్ కుమార్ ఐపీఎస్,వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఋూ మహమ్మద్ సందాని, మల్యాల సీ.ఐ రాజ్ కుమార్, QK#అదికారులు ఉన్నారు.

## పారిశుధ్య పరిరక్షణలో దుకాణ యజమానులు భాగస్వాములు కావాలి

**పరిశుభ్రమైన బాన్సువాడ మన బాధ్యత**

**మున్సిపల్ కమిషనర్**

**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి**

పారిశుధ్య పరిరక్షణలో ప్రతి దుకాణ యజమాని భాగస్వామి కావాలని మున్సిపల్ కమిషనర్ అన్నారు. బాన్సువాడ పట్టణంలోని దుకాణ యజమానులు తమ దుకాణాల పరిసరాలను ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దుకాణాల ముందు చెత్తాచెదారం, ప్లాస్టిక్, ఆహార వ్యర్థాలు వేయకుండా చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని తెలిపారు. దుకాణాల ముందు మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, డ్రైనేజీల్లో చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేయరాదని సూచించారు. ముఖ్యంగా ఆహార పదార్థాలు విక్రయించే దుకాణ యజమానులు పరిశుభ్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పట్టణ పారిశుధ్యం కాపాడడం మున్సిపాలిటీతో పాటు ప్రతి వ్యాపారి, పౌరుడి బాధ్యత అని పేర్కొన్న కమిషనర్, పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. "మన దుకాణం - మన బాధ్యత, మన పట్టణం - మన బాధ్యత, పరిశుభ్రమైన బాన్సువాడ - మనందరి లక్ష్యం" అని కమిషనర్ పిలుపునిచ్చారు.



## సమృద్ధిగా వానలు కురవాలి

**పంటలు బాగా పండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**కుటుంబ సమేతంగా నవదుర్గ పీఠక్షేత్రానికి దావ వసంత**

**లలిత సహస్రనామ పారాయణంలో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్**

**అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహణ**

**రైతులకు మేలు కలగాలని ఆకాంక్ష**



**జగిత్యాల, ఆగస్టు 18 (నేటి ప్రభాత దర్శిని):**

జగిత్యాల పట్టణంలోని నవదుర్గ పీఠక్షేత్రంలో నిర్వహించిన లలిత సహస్రనామ పారాయణ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమృద్ధిగా వానలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

## ఫారెస్ట్ శాఖలో 22 మంది అవుట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సభ్యత్వ నమోదు



**నేటి ప్రభాత దర్శిని కామారెడ్డి ప్రతినిధి.**

కామారెడ్డి జిల్లా జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 22 మంది ఉద్యోగులు జేఏసీ సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని, ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి జేఏసీ బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ రాజేందర్, ఉపాధ్యక్షులు ఇక్రమ్ జేఏసీ నాయకులు వీ మహేష్, దేవేందర్,రాజేష్ తదితర ఫారెస్ట్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మూడోసారి రక్తదానం చేసిన గంగరాజు

**వాత్సల్య బ్లడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6022వ రక్తదానం**

**బీం రక్తదానం చేసి మానవత్వం చాటిన కౌన్సిలర్**

**పేషెంట్ బంధువులకు రీప్లేస్‌మెంట్ రక్తం అందజేత**

**రక్తదాతకు వాత్సల్య బ్లడ్ ఫౌండేషన్ అభినందనలు**

**పేషెంట్ కుటుంబ సభ్యుల సంతోషం, కృతజ్ఞతలు**





**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 18 (నేటి ప్రభాత దర్శిని) :**

వాత్సల్య బ్లడ్ ఫౌండేషన్ తరఫున 6022వ రక్తదానం మంగళవారం నిర్వహించారు. లింగంపల్లి గంగరాజు, 22వ వార్డు కౌన్సిలర్ పెద్ద బోనాల గారు మూడోసారి బీం రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు. చందుపట్ల మంజుల గారికి, పేషెంట్ బంధువు చందుపట్ల భగవంతు రెడ్డి గారికి రీప్లేస్‌మెంట్‌గా రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వాత్సల్య బ్లడ్ ఫౌండేషన్ టీంకు ధన్యవాదాలు తెలిపారు. ఫౌండర్ ఆకారపు సుధాకర్, అధ్యక్షులు లింగంపెల్లి ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షులు బచ్చపల్లి నవీన్, ప్రధాన కార్యదర్శి ముద్రకోల సంతోష్, రామన్నపేట సాయి పెద్దబోనాల తదితరులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. పేషెంట్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ వాత్సల్య బ్లడ్ ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

## నిమ్స్ లో వైద్య చికిత్సకు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ ఎల్ ఓ సి అందజేత



**నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి**

నిజామాబాద్ ఆగస్టు 19:-నిజామాబాద్ నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు అవసరమైన వారికి నిమ్స్ లో చికిత్స పొందేందుకు అర్హులైన వారికి వైద్య చికిత్స కు అవసరమైన ఆర్థిక సహాయాన్ని (ఎల్ ఓ సి) నీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మీడియాకు తెలిపారు, మంగళవారం రోజు అర్బన్ ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స కొరకు వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎల్ఓసి పత్రాన్ని అర్హులైన వారికి అందజేశారు, ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో అర్హులైన వారికి ఎల్ఓసి ఇప్పించేందుకు తాను ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పేర్కొన్నారు, మరియు అదేవిధంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తుల పరిస్థితిని కూడా ఎప్పటికప్పుడు తాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే తెలిపారు, అదేవిధంగా మంగళవారం రోజు నిజామాబాద్ శివారు లోని స్థానిక సారంగపూర్ గ్రామానికి చెందిన కల్పనా అనే మహిళా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు తనను ఆశ్రయించినందుకు వారికి అర్హతలను బట్టి తాను వైద్య చికిత్సకు తగిన ఆర్థిక సహాయంగా రూపాయలు ఐదు లక్షల ఎల్ఓసిను తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు మంగళవారం రోజు అందజేశానని అర్బన్ ఎమ్మెల్యే పేర్కొన్నారు, కాగా పార్టీలకు అతీతంగా తాను తన నియోజకవర్గంలోని పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ మీడియాకు తెలిపారు. కాగా కేంద్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా వేలకోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన హైదరాబాద్ శివారులోని బీబీనగర్ నందు ఏర్పాటు చేసిన ఎయిమ్స్ లో ప్రస్తుతము అత్యాధునిక సేవలు అందుబాటులోకి వచ్చాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ స్పష్టం చేశారు, మరియు ఆర్థిక స్తోమత లేని పేదలు దీర్ఘకాలిక వైద్య సమస్యలు ఉన్నవారు అత్యవసర చికిత్సలు అవసరమైన వారు ఎయిమ్స్ కి వెళ్లాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ నిజామాబాద్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు, అలాగే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వము పేదల ఆరోగ్యమే పరమావధిగా పనిచేస్తుందని ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో అత్యాధునిక వైద్య పరికరాలతో సేవలతో కూడిన ఆసుపత్రిని హైదరాబాద్ శివారులోని బీబీనగర్లో వేలకోట్ల రూపాయలతో ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మించిందని ఈ యొక్క ఆసుపత్రి యొక్క సేవలను అర్హులైన వారందరూ తప్పకుండా వినియోగించుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని ఘనంగా నిర్వహణ



**నేటి ప్రభాత దర్శిని కామారెడ్డి ప్రతినిధి**

2026: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. వై. గిరి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడని అన్నారు. సామాజిక అసమానతలను ఎదుర్కొంటూ ప్రజల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, గౌడ సంఘాల ప్రతినిధులు, బహుజన సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# నేతాజీకి ఘన నివాళి

## సుభాష్ చంద్రబోస్ వర్ధంతి వేడుకల నిర్వహణ
## విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బీసీ సంఘం నేతలు
## ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు చేసిన నేతాజీ
## యువతలో దేశభక్తి రగిలించిన మహనీయుడు
## నేతాజీ చూపిన మార్గంలో నడవాలి: శ్రీనివాస్




**కామారెడ్డి, ఆగస్టు 18 (నేటి ప్రభాత దర్శిని):**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం గాంధారి మండల శాఖ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్‌ను స్మరించుకుంటూ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షులు చీమల్‌వార్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేతాజీ అనేక కష్టాలను ఎదుర్కొని ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. "మీరు నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను" అనే నినాదంతో యువతలో దేశభక్తిని రగిలించారని, తన ప్రాణాలను సైతం దేశం కోసం పణంగా పెట్టారని గుర్తు చేశారు. నేతాజీ త్యాగమే నేడు మనం స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవడానికి కారణమని, ఆయన చూపిన మార్గంలో నడవడమే మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దోల్లు లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీలు నస్కంటి రవి, సామల రాజు, వంజరి రాకేష్, యూత్ అధ్యక్షులు సిందే నితిన్, టౌన్ సెక్రటరీ ఆరె కటిక మోతిలాల్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆకుల రాకేష్, ఎంద్రియాల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

## విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
## ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్




**నేటి ప్రభాత దర్శిని కామారెడ్డి ప్రతినిధి**

కామారెడ్డి నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ (××=ా) ఏర్పాటు చేసేందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. అందులో భాగంగానే కామారెడ్డి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కావడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ద్వారా జి.ఓ.ఆర్.టి. నం.145, తేదీ 04-08-2026 ద్వారా కామారెడ్డి జిల్లా, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి రూ.200 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ సమీకృత వసతి పాఠశాల ద్వారా విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన పాఠశాల విద్యతో పాటు ఉన్నత విద్యకు అవసరమైన విద్యా వాతావరణం, ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా సదుపాయాలు, వసతి, భోజనం తదితర ఆధునిక మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కామారెడ్డి విద్యార్థులకు గొప్ప అవకాశంగా నిలుస్తుందని, భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించి పోటీ ప్రపంచానికి వారిని సిద్ధం చేయడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాసంస్థల ఆధునీకరణ, మౌలిక వసతుల కల్పన, డిజిటల్ విద్య, ప్రయోగశాలలు, ఆధునిక భవనాల నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. కామారెడ్డిని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగంగా రూ.200 కోట్ల ప్రాజెక్టు మరో కీలక ముందడుగు అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తామని, కామారెడ్డి నియోజకవర్గ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలోనే ఈ విద్యాలయాన్ని నిర్మించడం జరుగుతుందని మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్ వై గిరి. మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమా శ్రీనివాస్, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలా శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్



## రామ్‌చరణ్ గెస్ట్ రోల్
## ప్రచారాలను ఖండించిన టీమ్

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.